


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం

04 డిసెంబర్ 2025 పేజీలు : 08


## వరద ప్రభావిత ప్రాంతాల్లో
# ఎమ్మెల్యే సోమిరెడ్డి పర్యటన

**పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ - ప్రజలకు భరోసా**



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :**

మండలంలోని తుఫాను ప్రభావంతో రెండు రోజులుగా జిల్లాలో భారీ వర్షపాతం నమోదై పలు ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మంగళవారం వరద ప్రభావిత ప్రాంతాలను పర్యటించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి, వెంకటాచలం ఆర్టీసీ ట్రైనింగ్ కళాశాల పక్కన ఉన్న కాలనీ, ఇందిరమ్మ కాలనీకి వెళ్లి వరద ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలతో మాట్లాడి పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. తర్వాత ఆయన అనికేపల్లి పంచాయతీ గొలగమూడిలోని కాశీనగరం ఎస్టీ కాలనీని సందర్శించి, వరదనీరు చేరిన ఇళ్లను, ముంపునకు గురైన నారేతలను పరిశీలించారు. సోమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వెంకటాచలం మండలంలో 23 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. కుండపోత వర్షాల కారణంగా హైవేపై నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనికేపల్లి -మిగతా 2లో

## ■ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో..
# అధిక దిగుబడులు సాధించాలి

- సీఎం చంద్రబాబు వ్యవసాయాన్ని పండగ చేశారు
- చిన్న, సన్నకారు రైతుల కోసమే యూరియా కార్డుల విధానాన్ని ప్రవేశపెట్టాం
- యువత వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలి
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు రైతులకు ఎంఎస్ఎంఈ ద్వారా ఆర్థిక సహాయం
- గంజాయి రహిత కోవూరు స్థాపనలకు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలి
- డిమాండ్ ఆధారిత పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి

జగదేవిపేటలో 'రైతన్నా.. మీకోసం'లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

మారిన పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో వ్యవసాయంలో పండగ వాతావరణం నెలకొందని ఆమె పేర్కొన్నారు. బుధవారం ఇందుకూరుపేట మండలం జగదేవిపేటలోని రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె కూటమి ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ విధానాలను రైతులకు వివరించారు. భారీ వర్షాల -మిగతా 2లో



బుచ్చిరెడ్డిపాలెంలో లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్‌లు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించండి

జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌కు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వినతి


సానుకూలంగా స్పందించిన చైర్మన్..

## బుచ్చిరెడ్డిపాలెంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు
# చర్యలు తీసుకోండి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు జిల్లా కోవూరు అసెంబ్లీ పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం మునిసిపాలిటీ గుండా వెళ్లే జాతీయ రహదారి -67పై (చుంచీలూరు నుంచి నెల్లూరు వరకు) లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్‌ల నిర్మాణం చేపట్టాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను ఢిల్లీలోని ఆయన ఛాంబర్‌లో కలుసుకుని ఇందుకు సంబంధించి వినతి అందజేశారు. బుచ్చిరెడ్డిపాలెం మునిసిపాలిటీ పరిధిలో ఎన్‌హెచ్-67 (చుంచీలూరు నుండి నెల్లూరు వరకు) సెక్షన్‌లో కి.మీ. 722.33 నుంచి కి.మీ 724.800 వరకు లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్‌ల నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం బుచ్చిరెడ్డిపాలెం పరిధిలో ట్రాఫిక్ రద్దీ తీవ్రమైన సమస్యగా మారిందని, దీని కారణంగా తాత్కాలిక షెడ్‌లు, నెట్టడం బండ్ల రూపంలో రోడ్డుపై ఆక్రమణలు పెరుగుతున్నాయన్నారు. వాహనాలను సక్రమంగా పార్కింగ్ చేయకపోవడం, పాదచారులకు సురక్షితమైన, ప్రత్యేక ఫుట్‌పాత్ లేకపోవడం సమస్యగా మారిందని వివరించారు. దాంతో ప్రజలకు అసౌకర్యంగా ఉండటంతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇటీవల రహదారి విస్తరణలో భాగంగా రహదారిపై ఉన్న ఆక్రమణలను తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలో -మిగతా 2లో

## అన్నదాతలకు భరోసా లక్ష్యంగా
# 'రైతన్నా.. మీకోసం'



- జిల్లావ్యాప్తంగా డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు ప్రారంభం
- 5న జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో మెగా పేటీఎం
- మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి

లోపల పేజీలో

# డ్రగ్స్ రహిత కోవూరు.. నా లక్ష్యం

- గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోండి
- సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపండి, పేర్లు గోప్యంగా ఉంటాయి
- గంజాయిని అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గ తెలుగు యువత గంజాయికి వ్యతిరేకంగా గళం విప్పింది. నెల్లూరు నగరం మాగుంట లేఔట్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సమక్షంలో కోవూరు తెలుగు యువత నాయకులు 'గంజాయి వద్దు బ్రో' పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ స్ఫూర్తితో గంజాయి రహిత కోవూరు సాధన కోసం కృషి చేస్తానన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో గంజాయి అమ్మకాలు, సేవనం జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను ఆదేశించారు. యువతను చైతన్య పరచడానికి 'గంజాయి వద్దు బ్రో' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కోవూరు తెలుగు యువత నాయకులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభినందించారు. గంజాయిని అరికట్టడంలో ప్రజల సహకారం అవసరమని, గంజాయికి సంబంధించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి పేర్లు పోలీసులు గోప్యంగా ఉంచుతారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, వేమారెడ్డి బాలకృష్ణా రెడ్డి, కేతంరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ తెలుగు యువత నాయకులు సాయి జయంత్ రెడ్డి, సాయితేజ రెడ్డి, టిడిపి ఇందుకూరు పేట, బుచ్చి టిడిపి అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, గుత్తా శ్రీనివాసరావు, యువ నాయకులు గురు మహేష్, హరి, లోకేష్, పవన్, నయాజ్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి



*(మొదటి పేజీ తరువాయి)*

నేపథ్యం.. గ్రామానికి చేరుకున్న ప్రశాంతమ్మకు కూటమి నాయకులు, రైతులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన ఉద్యాన పంటలు, ఆక్వా సాగును పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి సాగు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతుల కోసమే యూరియా కార్డుల విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని ఆమె రైతులకు సూచించారు. డిమాండ్ ఉన్న పంటలను పండించాలని ఆమె రైతులను కోరారు. ప్రజల అవసరాలను గుర్తించి సుపారిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. రైతులకు ఇప్పటికే రెండు విడతలు యూరియా పంపిణీ చేశామని, త్వరలో మరో విడత పంపిణీ చేస్తామన్నారు. రైతుల సాధక బాధలు ప్రత్యక్షంగా తెలుసుకోవడమే రైతన్నా.. మీకోసం కార్యక్రమ లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతను ఇస్తున్నారని చెప్పారు. బుచ్చిరెడ్డిపాలంలో జాతీయ రహదారి విస్తరణకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఛైర్మన్‌ను కలిశారని, 8 కోట్లతో రహదారి విస్తరణ జరగనుందని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంపీకి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఇంకా ఎవరికైన అన్నదాత సుఖీభవ అందకుంటే సచివాలయంలో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రస్తుతం చదువుకున్న వారు వ్యవసాయంలో రాణిస్తున్నారని చెప్పారు. సజ్జ, జొన్న, రాగులు వంటి పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. మత్స్యకారుల సేవలో పథకం కింద వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని 20 వేలు చేశారన్నారు. తల్లికి వందనం కింద ఎంతమంది విద్యార్థులున్నా.. అందరికీ పథకం అమలు చేశారన్నారు. కోవూరు నియోజకవర్గాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే ప్రశాంతమ్మ పిలుపునిచ్చారు. పోలీసులకు ఇప్పటికే తగిన ఆదేశాలు జారీ చేశామని, స్కూళ్లు, కాలేజీల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి నియంత్రణలో పౌరులు కూడా భాగస్వాములు కావాలన్నారు. ఇందులో మీడియా ప్రతినిధులు కూడా నిత్యం అప్రమత్తంగా ఉండి.. ఎక్కడ ఏం జరుగుతుందో పరిశీలించాలన్నారు. అందరి సహకారంతోనే గంజాయిని నియంత్రించగలమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ, ఉద్యానవన అధికారులు రఘునాథ రెడ్డి, అనురాధమ్మ, తహసీల్దారు మురళి, ఎంపీడీఓ నాగేంద్ర, టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, ఎంఎస్‌ఎంఈ డైరక్టర్ రావెళ్ల వీరేంద్ర నాయుడు ఇందుకూరుపేట టిడిపి అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు చెంచుకిషోర్ యాదవ్, పిఎల్ రావు, మండల టిడిపి ఉపాధ్యక్షులు కూకటి వెంకటేశ్వర్లు రెడ్డి, ఇందుకూరుపేట సహకార సంఘ అధ్యక్షులు గండవరపు అమరనాధ్ రెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షులు దేవిరెడ్డి రవీంద్ర రెడ్డి, స్థానిక నాయకులు కుదురు రామకృష్ణారెడ్డి, బొల్లినేని రావినాయుడు, బొల్లినేని హరి నాయుడు, మల్లికార్జున నాయుడులతో పాటు బిజెపి, జనసేన నాయకులు, టిడిపి యూనిట్, క్లస్టర్ బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

### బుచ్చిరెడ్డిపాలెంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు
## చర్యలు తీసుకోండి


*(మొదటి పేజీ తరువాయి)*

జాతీయ రహదారి-67పై లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్‌ల నిర్మాణ పనులను చేపట్టాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన సంతోష్ కుమార్.. తప్పకుండా వినతులను పరిశీలించి బుచ్చిలో ట్రాఫిక్ నియంత్రణకు లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్స్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



### మత్స్యకారులు పీఎంఎంఎస్‌వై పథకాన్ని
## సద్వినియోగం చేసుకోవాలి

**మత్స్యకారులకు ఇంజన్లు అందజేసిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ**



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఎన్‌డీఏ ప్రభుత్వంలో మత్స్యకారులకు ఎంతో లబ్ధి చేకూరుతోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధాన్‌మంత్రి మత్స్య సంపద యోజన కింద ఊటుకూరు, పల్లిపాలెంలో 10 మంది మత్స్యకారులకు 40 శాతం రాయితీతో మంజూరైన బోట్ల ఇంజిన్లను బుధవారం ఎమ్మెల్యే ప్రశాంతమ్మ నెల్లూరులోని తన నివాసంలో వారికి అందజేశారు. ఒక్కోటి 10 హెచ్‌పీ సామర్థ్యం గల పది యూనిట్ల విలువ 8.33 లక్షలు కాగా.. రాయితీ పోను 4.99 లక్షలు మత్స్యకారులు చెల్లించినట్లు చెప్పారు. వేటకు వెళ్లే మత్స్యకారులకు బోట్ల ఇంజిన్లు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ జేడీ శాంతి, ఇందుకూరుపేట ఎఫ్‌డీవో సురేష్ బాబు, వీఎఫ్‌వో సహానా, నాయకులు బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డి, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే సోమిరెడ్డి

*(మొదటి పేజీ తరువాయి)*

తదితర ప్రాంతాల్లో నారేతలు కూడా పెద్ద సంఖ్యలో ముంపునకు గురయ్యాయని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. రైతులు, పేదలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వైసీపీ పాలనపై ఆయన విమర్శలు చేస్తూ.. గత ఐదేళ్లలో వైసీపీ ఇరిగేషన్ వ్యవస్థను అధ్వాన్నంగా మార్చింది. పనులు చేయకుండానే బిల్లులు చెల్లించిన కారణంగానే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పుడు వాటిని సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. పర్యటనలో పీఏసీఎస్ ఛైర్మన్ రావూరు రాధాకృష్ణమనాయుడు, సీనియర్ నాయకుడు మునుస్వామి, ఎంపీడీవో కల్పన, అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్ల నెలవారి సమీక్షా సమావేశం




**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వి. సుజాత, అడిషనల్ డిఎంహెచ్‌ఓ ఎస్ కె. ఖాదర్ వలి, డిఎల్‌ఏటిఓ, జిల్లా మలేరియా అధికారి ఇ.హుసేనమ్మ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్‌లకు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్వో మాట్లాడుతూ.. ఈ మధ్య జరిగిన ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వేలో సేకరించిన రక్తపూతలను సక్రమమైన విధంగా స్టెయిన్ చేసి మైక్రోస్కోప్‌లో పరీక్షను నిర్వహించి ఫలితాలను డిఎంఓ కార్యాలయానికి నిర్ణీత సమయంలో పంపాలని, క్షయ అనుమానిత హైరిస్క్ ప్రజలను గుర్తించి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించి పాజిటివ్ కేసులకు తగిన చికిత్స త్వరితగతిన అందునట్లు చూడాలని తెలిపారు. ల్యాబ్‌లో 60 రకాల రక్త పరీక్షలను సకాలంలో నిర్వహించి ఖచ్చితమైన ఫలితాలను అందజేయాలని తెలిపారు. జిల్లా మలేరియా అధికారిణి ఇ.హుసేనమ్మ మాట్లాడుతూ.. ల్యాబ్ టెక్నీషియన్లు అందరూ అన్ని రకాల రికార్డులను సక్రమంగా నిర్వహించి ఏఎన్‌ఎంలు హెల్త్ అసిస్టెంట్స్ క్వాలిటీగా రక్తపూతులు సేకరించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. సహాయ మలేరియా అధికారి వి.నాగార్జునరావు, ఎస్కే ఖాదరవలి డిఎల్‌ఏటిఓ మాట్లాడారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, జిల్లా ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# జలదంకిలో రైతన్న మీకోసం.. హాజరైన ఎమ్మెల్యే కాకర్ల



**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన జలదంకి రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైయస్ జగన్ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల కాలంలో ఉదయగిరి నియోజకవర్గంలో కాలువలకు చెరువులకు ఏ ఒక్క రూపాయి నిధిని ఇవ్వలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే చెరువులకు కాలువలకు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి, కాలువలకు మర మ్మతులు చేసి రైతులకు అండగా నిలిచామన్నారు. జలదంకి కొండాపురం కలిగిరి మండలాలకు సమస్యలన్నీళ్లు వస్తాయని, మిగిలిన ఐదు మండలాలు వర్షాభావంతోనే పంటలు పండుతాయన్నారు. గండిపాలెం రిజర్వాయర్‌ను కూడా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పట్టించుకోకపోవడంతో ఆ భారం ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే పడిందన్నారు. రైతులకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మునగాల తిరుమలరెడ్డి, తహసిల్దార్ సీతామహాలక్ష్మి, వింజమూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శేషగిరి, వ్యవసాయ అధికారిని శ్రీవాణి, నాయకులు జనార్దన్ రెడ్డి, మాల్యాద్రిరెడ్డి, మధుమోహన్‌రెడ్డి, ఏగూరి రఘు, జాజుల శివ రామయ్య, మదన్, సొసైటీ అధ్యక్షులు కరియావుల అప్పలనాయుడు, జనసేన నాయకులు నిమ్మలపల్లి రామచైతన్య, బిజెపి మండల అధ్యక్షులు ముడి కిషోర్ రెడ్డి, చల్ల హనుమారెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ స్కూల్లో సెంట్రల్ లేబరేటరీ ప్రారంభం




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని మైపాడు రోడ్, ప్రశాంతి నగర్ నందుగల నారాయణ సీబీఎస్ఈ స్కూల్ ప్రాంగణంలో బుధవారం అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలతో నిర్మితమైన సెంట్రల్ లాబొరేటరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏజీఎం శ్రీధర్, రవి వర్మ తదితరులు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రాక్టికల్ అభ్యాసాన్ని మరింత మెరుగుపరచి, శాస్త్ర విజ్ఞానాన్ని అనుభవాత్మకంగా నేర్పించడం లక్ష్యంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాలకు చెందిన లాబ్స్‌ను ఆధునిక పరికరాలతో, డిజిటల్ బోర్డ్స్‌తో, సేఫ్టీ స్టాండర్డ్స్‌తో రూపొందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. ఈ సెంట్రల్ లాబ్స్ రూపకల్పన, అభివృద్ధి, నిర్మాణం జరగడంలో నారాయణ గ్రూప్ జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి నిరంతర ప్రోత్సాహం, మార్గదర్శకత్వం, విద్యా ప్రమాణాల మెరుగుదలపై ఉన్న కట్టుబాటు ముఖ్య పాత్ర పోషించాయనీ, వారి సంకల్పంతోనే విద్యార్థుల కోసం అంతర్జాతీయ స్థాయి లాబొరేటరీలు వేగంగా సిద్ధం కావడం విశేషమని తెలిపారు. విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీలకు సన్నద్ధం చేసేలా నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే నారాయణ విద్యాసంస్థల లక్ష్యమన్నారు. అదేవిధంగా ఈ కొత్త లాబ్స్ విద్యార్థుల పరిశోధనా దృక్పథాన్ని ఆవిష్కరణాత్మకతను పెంపొందిస్తాయనీ తెలిపారు. ఈ సందర్భంగా లాబ్స్‌ను సందర్శించిన విద్యార్థులు, తల్లిదండ్రులు కొత్త సదుపాయాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తూ, తమ అభ్యాసం మరింత సమర్థవంతంగా సాగుతుందన్నారు. స్కూల్ వాతావరణంలో ఇలాంటి అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి రావడం పట్ల వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆదిశేషయ్య, ప్రిన్సిపాల్ సునీల్, గోమతి స్కూల్ ప్రిన్సిపాల్ సుధీర్, అకడమిక్ డీన్ ఖాజావలి, కెమిస్ట్రీ ఫ్యాకల్టీ కళ్యాణి, బయాలజీ హెడ్ అక్షయ, హర్ష తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అలేఖ్య జన్మదిన వేడుకలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్పర్సన్ పోతుగంటి అలేఖ్య జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యకర్తలు గ్రంధి అభిమానులు అలేఖ్య నివాసానికి, ఏఎంసీ కార్యాలయానికి పెద్ద ఎత్తున సిబ్బంది టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు వచ్చి శుభాకాంక్షలు, నిండు నూరేళ్లు వర్ధిల్లాలని అలాగే ఇంకా ఉన్నత పదవులు అలంకరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ.. తన 40 ఏళ్ల ప్రజా జీవితంలో తన తండ్రి దివంగత గ్రంధి అలంకరించిన పదవులను కేవలం 12 ఏళ్ల స్వల్ప వ్యవధిలోనే కావలి మున్సిపల్ చైర్మన్, ఏఎంసీ చైర్ పర్సన్‌గా పదవులు అధిరోహించి తండ్రికి మించిన తనియుగా కీర్తి గడిచారని వారు కొనియాడారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నేతృత్వంలో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తనను పలకరించేందుకు వచ్చిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సహకారంతో సామాన్య ప్రజల సేవే లక్ష్యంగా తన తండ్రి గ్రంధి ఆశయ సాధనకు కృషి చేస్తానని తెలిపారు.

# తోటపల్లి గూడూరులో రైతన్న మీకోసం వర్క్‌షాప్



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో శనివారం 'రైతన్న మీకోసం' వర్క్‌షాప్‌లు నిర్వహించారు. వరికొండ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారిణి శిరీష రాణి ఆధ్వర్యంలో అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. రైతులకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకాలపై సూచనలు అందించారు. శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్ఎల్ఆర్ 3238, ఎన్ఎల్ఆర్ 34449 వరి రకాలతో పాటు నువ్వులు, పెసలు, మొక్కజొన్న, చిరుధాన్యాలు ఆదాయదాయకమని తెలిపారు. మత్స్యశాఖ జేడీ శాంతి పాలీకల్చర్-ఆక్వా కల్చర్ ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అనంతరం ముఖ్యమంత్రి పాల్గొన్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని దూరదర్శన్ ద్వారా వీక్షించారు.

## అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని హరిజన పాలెంలో ఉన్న పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు బండి గోవిందయ్య, సిహెచ్ వెంకటసుబ్బయ్య హాజరయ్యారు. అనంతరం వారు దివ్యాంగుల దినోత్సవం యొక్క విశిష్టతను వివరించారు. అనంతరం ఆటలు పోటీలు విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల అధ్యక్షురాలు నాగమణి, భవిత సెంటర్ ఉపాధ్యాయిని మంచికలపాటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు మేధావులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో దివ్యాంగులు మేధావులని ముత్తుకూరు మండల కేంద్రం జడ్పీ హైస్కూలు స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు స్రవంతి అన్నారు. బుధవారం హైస్కూల్ నందు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా పిల్లలకు స్వీట్లు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్పెషల్ ఎడ్యుకేషన్ మాట్లాడారు. దివ్యాంగులను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరు వారిని గౌరవించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో బుధవారం ముత్తుకూరు మండల కేంద్రం నిర్వాసిత కాలనీకి చెందిన కే.రత్న అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడినారు. నెల్లూరు ముత్తుకూరు రోడ్డు మార్గంలో రిలయన్స్ రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు బాధితుడిని ఢీకొట్టింది. 108 సిబ్బంది సంఘటన స్థలం వచ్చి ప్రథమ చికిత్స అందించి జిల్లా కేంద్రానికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

## నిడిగుంట అరుణ బెయిల్ మంజూరుపై నేడు హైకోర్టులో విచారణ

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నేర ప్రవృత్తి కలిగిన మహిళగా రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన నిడిగుంట అరుణ తనను బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ పెట్టుకున్న దరఖాస్తుపై రాష్ట్ర హైకోర్టు నేడు విచారణ చేయనుంది. అరుణ గత నెల 18న హైకోర్టు జస్టిస్ లక్ష్మణరావు ఎదుట బెయిల్ పిటిషన్ పెట్టుకోగా నోటీసు అందుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని అభ్యర్థించారు. ఆ మేరకు న్యాయమూర్తి గురువారం నాటికి వాయిదా వేశారు.

## గిరిజనులకు పరామర్శ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** తుఫాను కారణంగా ఇబ్బందులు పడుతున్న వల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గిరి జన కాలనీవాసులను బుధవారం తిరుపతి పార్లమెంటు తెలుగు యువత కమిటీ ఉపాధ్యక్షుడు తుమ్మల శ్రీనాథ్ పరామర్శించినారు. ఆయనతోపాటు ఎంపీడీవో నాగమణి, పంచాయతీ అధికారులు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన భరోసా కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఛిద్రమైన రహదారికి మోక్షం కలిగేనా?





**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు నడిమూరు నందు దేవతా మహల్ సెంటర్ నుండి శ్రీ సరస్వతి హై స్కూల్ మీదుగా హైవే రోడ్డుకు వెళ్లే రహదారి చిత్రమై బురదమయమై ప్రయాణించడానికి బాధాకరంగా మారింది ఇటీవల కురుస్తున్న దిత్వా తుఫాను వర్షాలకు మరింత గుంతల మయమై నీరు నిల్వచేరి ఎక్కడ గుంట ఉందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. వాహనదారులు ప్రయాణించడానికి తీవ్ర అసౌకర్యంగా ఏర్పడింది. ఈ విషయాన్ని ఎంపీడీవో పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా బుధవారం పంచాయతీరాజ్ శాఖ ఏఈ పతిరుమలయ్యతో కలిసి పంచాయతీ ఈఓ కే.రామారావు, సర్పంచ్ ఎన్.సుజనాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఈ రహదారి పూర్తిగా చిత్రమైందని వీలైనంత తొందరగా రహదారి మార్గం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఈ మార్గం గుండా అనేకమంది రైతులు పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఎంతో మంది ఉన్నారని వారందరికీ సౌకర్యవంతంగా ఉండేందుకు త్వరలో ఈ మార్గాన్ని సౌకర్యవంతం చేస్తామన్నారు. అందుకే పిఆర్ఏఈ పరిస్థితిని గమనించి ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలో మంజూరయ్యే విధంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మార్గం మొత్తం 750మీటర్లు ఉందని ఎంతవరకు ఇబ్బందికరంగా ఉందో గుర్తించి అంతమేరా రహదారిని వేయడమా లేదా పూర్తిగా వేయడం అనేది పరిశీలించి చేస్తామన్నారు. ముఖ్యంగా ఈ మార్గం గుండా అధిక సంఖ్యలో విద్యార్థులు పాఠశాలకు వస్తుంటారు పాఠశాలకు వచ్చే విద్యార్థులు చిన్న వయసు గనుక ఇబ్బందులు పడుతూ ఉన్నారు. వీటన్నింటినీ గమనించి త్వరలో రహదారి మార్గాన్ని సౌకర్యవంతం చేయాలని ఈ ప్రాంత వాసులు రైతన్నలు కోరుకుంటున్నారు.

# మేయర్ స్రవంతి జయవర్ధన్ వెంటే ఉంటాం

### గిరిజన యానాది సమాజం




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** మేయర్ స్రవంతిజయవర్ధన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, జోరు వానను సైతం లెక్కచేయకుండా గిరిజన యానాది సమాజం బుధవారం భారీ స్థాయిలో అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంతో గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు, నిరసన తెలియజేశారు. గిరిజన యానాది సమాజం మేయర్ స్రవంతిజయవర్ధన్ కి సంపూర్ణ మద్దతు పలికిందని వారు తెలిపారు. నగరాభివృద్ధిలో ఆమె చూపిన పారదర్శకత, నాయకత్వాన్ని విస్మరించి చేస్తున్న అవిశ్వాస తీర్మానం పూర్తిగా రాజకీయ కుట్రేనని, ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీయే ఇటువంటి చర్యలు ఎట్టి పరిస్థితులలోనూ సహించబోవని, స్పష్టం చేశారు. అవిశ్వాస తీర్మానం వెంటనే ఉపసంహరించాలని, ప్రజల్ని, వారి అభిమతాన్ని మించిన రాజకీయాలను మేము అంగీకరించమని స్పష్టం చేశారు. గిరిజన ప్రజా సంఘాల నాయకులు వేముల లక్ష్మి మాట్లాడుతూ.. ఎన్నో కులాలు ఉన్నా వారికి ఇబ్బంది లేకుండా, ఒక్క మా యానాది మేయర్‌పైనే దాడి చేయడం ప్రజాస్వామ్య నైతికతకు విరుద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో యానాది యూత్ రాష్ట్ర పేరడైజేషన్ అధ్యక్షులు కుమ్మరగిరి వెంకట ప్రసాద్, గిరిజనల సంక్షేమ సంఘం నాయకులు, బిఎల్ శేఖర్, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆదేశాలతో భోజన సదుపాయం కల్పించాం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాలతో యుద్ధ ప్రాతిపదికన నెల్లూరు -ముత్తుకూరు రోడ్డు మార్గంలో బ్రహ్మదేవి విద్యుత్తు కార్యాలయం ఎదురుగా కాలువ గట్టుపై నివాసం ఉంటున్న 100 మంది గిరిజనులకు బుధవారం భోజనం సదుపాయం కల్పించామని స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ గౌరవాధ్యక్షులు కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మ **మేజర్‌న్యూస్‌**కు తెలియజేశారు. కురుస్తున్న భారీ వర్షాలతో ఆకలికి ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు అండగా నిలిచి భోజనం సరఫరా చేయాలని తమ నాయకుడు ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆదేశించగా ఈ సేవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు టీడీపీ సీనియర్ నాయకులు కొత్తపల్లి తెలియజేశారు. తక్షణమే స్పందించి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, టీడీపీ నాయకులు బొబ్బేపల్లి అంకయ్య, దాసరి శ్రీనివాసులు, యూనిట్ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డి, టీడీపీ మండల కార్యదర్శి లక్ష్మీ ప్రసాద్, తెలుగు యువత కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకల శివకుమార్, గ్రామ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ భరద్వాజ మసూదన్ రావు, బూత్ కమిటీ అధ్యక్షుడు బద్రి, మారు బోయిన వెంకటరమణయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పెంచలకోన హుండీ లెక్కింపు

**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో క్షేత్ర పాలకుడు సుందర వీరాంజనేయస్వామివారికి హనుమన్ వ్రతం సందర్భంగా బుధవారం పంచామృత అభిషేకం పూలంగిసేవ, ఆకుపూజ, తిరుచ్చిపల్లకిపై ఆస్థానసేవ ప్రధాన అర్చకులు, అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణలతో వైభవంగా నిర్వహించారని దేవస్థానం ఉపకమీషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈనెల 4న హుండి లెక్కింపు కార్యక్రమం సందర్భంగా ఆసక్తి ఉన్న భక్తులు పంచా, ఉత్తరనిధరించి స్వామివారి సేవలో పాల్గొన వచ్చునని దేవస్థానం ఉప కమీషనర్, కార్యనిర్వ హణాధికారి పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రకటనలో కోరారు.



## అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనం సరఫరా



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అదాని కృష్ణపట్నం పోర్టు, అదాని ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం 600 మంది గిరిజనులకు భోజన సదుపాయం కల్పించినట్లు సీఈవో జగదీష్ పటేల్ మీడియాకు తెలియజేశారు. తుఫాన్ కారణంగా ఆహారానికి అవస్థలు పడుతున్న సందర్భంలో కృష్ణపట్నం, ముత్తుకూరు గ్రామపంచాయతీల ఎస్టీ కాలనీల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో ప్రథమ స్థానంలో ఉంటామని అన్నారు

## ఎస్ఈఐఎల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం పైనంతపురం గ్రామపంచాయతీలో సీఎస్ఆర్ నిధుల ద్వారా సేవా కార్యక్రమాలు జరిగాయి. ద్విత్వా తుఫాను కారణంగా జీవనోపాధి కోల్పోయిన చిన్న గిరిజన సంఘం కాలనీ వాసులకు భోజన సదుపాయం కల్పించాలని మండల తాసిల్దార్ స్వప్న విజ్ఞప్తి చేయగా ప్రాజెక్ట్ యాజమాన్యం తక్షణమే స్పందించి భోజన ఏర్పాట్లు నిర్వహించినట్లు ప్రాజెక్ట్ అధికారులు మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు ఇరువురికి కృతజ్ఞతలు తెలిపారు.

## డిగ్రీ విద్యార్థులు విజ్ఞాన విహారయాత్ర




**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు విహారయాత్రలో భాగంగా బుధవారం రాపూరు మండలంలోని పోతుకొండ శ్రీశ్రీ అంకమ్మతల్లివారి దేవాలయంను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.హనుమంతయ్య ఆధ్వర్యంలో అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు 550 సంవత్సరాల పురాతనమైన చరిత్ర కలిగిన క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వి.హనుమంతయ్య డాక్టర్ వి.హనుమంతయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో భాగంగా విహారయాత్రలు చేయడం ద్వారా చారిత్రక విజ్ఞానం సంపాదించుకోవచ్చని, అదేవిదంగా భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు, వారసత్వాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ వి.మల్లికార్జున ఈ సందర్భంగా స్థల ప్రాముఖ్యత గురించి, దేవాలయంలో ఉన్న శాసనాల గురించి విద్యార్థిని విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## రేపు ఏపీ ఎన్‌జీజీఓ సంఘం ఎన్నికలు

### ● వింజమూరు తాలూకా నామినేషన్ స్వీకరణ

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఏపీ ఎన్‌జీజీఓ అసోసియేషన్ వింజమూరు తాలూకా యూనిట్ నామినేషన్ ప్రక్రియ స్థానిక వింజమూరు ఎంపీడీఓ కార్యాలయంలో 5వ తేదీ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని వింజమూరు తాలూకా ఎన్నికల అధికారి, కావాలి తాలూకా అధ్యక్షులు శివ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంభందించి నవంబర్ 19వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం తాలూకా యూనిట్ ఎన్నికలు జరుగుతాయి. ఇందుకు గాను సహాయ ఎన్నికల అధికారిగా కావలి తాలూకా కార్యదర్శి డీవీ నాగరాజుని అలాగే ఎన్నికల పర్యవేక్షణకు జిల్లా ఉపాధ్యక్షులు పి.సతీష్ బాబులను జిల్లా అధ్యక్షులు నియమించారాని తెలియజేశారు. కావున వింజమూరు తాలూకా పరిధిలోని ఉద్యోగులందరూ ఈ ఎన్నికలో పాల్గొని ఎన్నికలు విజయవంతం చేయాలని కోరారు.

# రాష్ట్రస్థాయి ఎన్‌సీసీ డ్రోన్ శిక్షణ శిబిరం ప్రారంభం

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రస్థాయి డ్రోన్ ట్రైనింగ్ క్యాంప్ దేశవ్యాప్తంగా నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ప్రారంభించిన మొదటి, సమగ్ర డ్రోన్ శిక్షణ కార్యక్రమాలలో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ శిబిరం నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్‌సీసీ ప్రాంగణంలో బుధవారం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో గుంటూరు గ్రూప్‌కు చెందిన క్యాంప్ కమాండెంట్, డ్రోన్ ఇన్‌స్ట్రక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గౌదంగవే ప్రారంభించారు. ఆంధ్ర–తెలంగాణ డైరెక్టరేట్‌కు చెందిన తొమ్మిది గ్రూప్ హెడ్‌క్వార్టర్స్‌ల నుండి వచ్చిన 200 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ప్రారంభోత్సవ ప్రసంగంలో లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గోదాంగవే, జాతీయ భద్రత, విపత్తు నిర్వహణ, సముద్ర కార్యకలాపాలు, పర్యవేక్షణ, పర్యావరణ పరిశీలన, కమ్యూనికేషన్ రంగాలలో డ్రోన్ సాంకేతికత ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై యువతకు శిక్షణను పెంపొందించేందుకు ఎన్‌సీసీ ప్రాక్టికల్ చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. డిసెంబర్ 1 నుంచి 12 వరకు జరిగే ఈ 12 రోజుల శిబిరంలో యుఏవి సూత్రాలు, డ్రోన్ అసెంబ్లీ, కాలిబ్రేషన్, సిమ్యులేటర్ ఆధారిత ఫ్లైట్ ట్రైనింగ్, పర్యవేక్షణలో బహిరంగ ఫ్లైయింగ్ సెషన్లు వంటి పలు శిక్షణ మాడ్యూల్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ శిక్షణతో క్యాడెట్లలో సాంకేతిక నైపుణ్యం, ఆచరణాత్మక క్రమశిక్షణ, ఆపరేషనల్ ప్రవర్తన అభివృద్ధి చెందేలా రూపకల్పన చేయబడింది. శిక్షణతో పాటు క్యాడెట్ల కోసం తత్త్వ పరీక్షలు, అసెంబ్లీ, వైవా పరీక్షలు, ఫ్లైయింగ్ నైపుణ్య పరీక్షలు, ఇన్నోవేషన్ ప్రదర్శనలు, ప్రెజెంటేషన్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు



నిర్వహించబడుతున్నాయి. ఇవి నాయకత్వం, జట్టు భావన, సృజనాత్మక సమస్య పరిష్కార సామర్థ్యాలను ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తాయి. ఆంధ్ర–తెలంగాణ డైరెక్టరేట్‌కు ఈ శిబిరం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని, క్యాంప్ కమాండెంట్ పేర్కొన్నారు. 'ఈ ట్రైనింగ్ ఎన్సిసి క్యాడెట్లలో సాంకేతిక అవగాహన, నమ్మకం, సన్నద్ధతను గణనీయంగా పెంచుతుంది. భవిష్యత్‌లో దేశ సేవలో సాంకేతిక రంగాల్లో వారు మరింత సమర్థవంతంగా పనిచేయగలిగి ఉంటారు' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం సేఫ్టీ ప్రోటోకాల్‌లు, శిక్షణ పద్ధతి, రోజువారీ షెడ్యూల్‌పై సమగ్ర వివరణ ఇచ్చారు. మూడో రోజు నుండి సిమ్యులేటర్, అసెంబ్లీ శిక్షణ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత పర్యవేక్షణలో దశల వారీగా ఫ్లైయింగ్ సెషన్లు నిర్వహించబడతాయని గణేష్ గౌదంగవే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి కేడేట్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను మర్రిపాడు మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి నాగేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. దివ్యాంగులలో అంతర్గతంగా ఎన్నో దివ్యమైన శక్తులు దాగి ఉంటాయని, వాటిని వెలికి తీయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య, ధనలక్ష్మి, ఫిజియోథఫీ వైద్యులు రఫీ, రిసోర్స్ పర్సన్ రాజేంద్రకుమార్, సహిత విద్య ఉపాధ్యాయులు రషీద్, విజయలక్ష్మి, సీఆర్‌ఎంటీ ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, తల్లిదండ్రులు, దివ్యాంగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం

● కాలువ వంతెనపై రక్షణ కంచెలు ఏర్పాటు ● గ్రామస్తుల సమస్యకు ఎమ్మెల్యే తక్షణ పరిష్కారం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** కొన్ని రోజుల క్రితం అన్నవరంలో జరిగిన చిన్నక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి కావలి కాలువకు రెండవ విడత నీటి విడుదల కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకి సంబంధిత కావలి కాలువ వంతెనకు రక్షణ కంచెలు లేకపోవడం వల్ల గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలు వంటి పశువులు కాలువలో పడిపోతున్నాయని, దీని వలన గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. గ్రామస్థుల సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జలదంకి మండల కో–కన్వీనర్ వేల్పుల వేణుగోపాల్‌కు సమస్యను అత్యవసర ప్రాతి పదికన పరిష్కరించాలని తెలియజేశారు. ఎమ్మెల్యే ఆదేశాలను అందుకున్న వెంటనే మండల కో–కన్వీనర్ వేల్పుల వేణుగోపాల్, సీనియర్ నాయకులు వేల్పుల ధనుంజయ, నాయకులు కలిసి వెంటనే ప్రదేశాన్ని పరిశీలించి వంతెనపై రక్షణ కంచెలు త్వరితగతిన ఏర్పాటు చేశారు. దీంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ సమస్యను తక్షణమే పరిష్కరించినందుకు ఎమ్మెల్యేకి, గ్రామ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొనే సమస్యలను తక్షణమే పరిష్కరించడం కోసమే ఈ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల ప్రభుత్వం ప్రజలకోసమే పనిచేస్తుందని తెలిపారు. గ్రామస్తుల భద్రత, వారి ఆస్తి రక్షణ తమకు అత్యంత ప్రాధాన్యత అని కూడా స్పష్టం చేశారు.

# గిరిజనులను పునరావాస కేంద్రానికి తరలింపు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని శివాలయం వీధిలో చెరువు కట్ట క్రింద నివసిస్తున్న గిరిజనులను బుధవారం తెల్లవారు జామున పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగింది. దిత్వా తుఫాన్ కారణంగా పొదలకూరులో గత 4రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో ఇక్కడి గిరిజనుల ఇళ్లు నీటి ప్రవాహంలో చిక్కుకొని ముంపునకు గురయ్యాయి. దీంతో టీడీపీ యువనేత ఆదాల మురళీ రెడ్డి,వీఆర్వో మస్తాన్, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో గిరిజనులను అక్కడి నుంచి సురక్షితంగా పునరావాస కేంద్రానికి తరలించి వారికి వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

# వయోవృద్ధులకు రక్షణ చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి మండలం ఆముదాలదిన్నె గిరిజన కాలనీలో వయోవృద్ధులకు రక్షణ చట్టం మీద అవగాహన సదస్సు కావలి మండల న్యాయ సేవాధికారిక చైర్మన్ ఏ.గీత వాణి ఆదేశాల మేరకు కావలి మండల లీగల్ మెంబర్, న్యాయవాది ఐ.సాయిప్రసాద్ లోకదాలత్ మెంబెర్ ఎం.మాలకొండరెడ్డి నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వయోవృద్ధులను, తల్లిదండ్రులను, తమ పిల్లలు నిర్లక్ష్యం చేసిన ఏదో వారి ఆస్తులను అక్రమంగా పొందిన వారిని అనాథలు చేసిన వారిపై వయోవృద్ధుల రక్షణ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అలాగే ప్రభుత్వాలు విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వృద్ధులను, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. న్యాయ సేవాధికారక సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని ఇక్కడ ఉన్న ప్రజలకు అవగాహన కల్పించారు. కాలనీలో



నివసిస్తున్న పిల్లలు అందర్నీ బడికి పంపించాలని సమాజంలో గౌరవంగా జీవించాలని సాయిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎల్లంపల్లి రమణయ్య, వెంకమ్మ, చెంచమ్మ, శాంతమ్మ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తుఫాను నేపథ్యంలో వీఎస్‌యూలో..

# ఉపకులపతి ఆకస్మిక పర్యటన

ఏ సమస్యైనా నేరుగా నాకే తెలియజేయండి : వీసీ అల్లం శ్రీనివాసరావు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** తుఫాను, ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు విద్యార్థుల అండగా నిలిచారు. బుధవారం ఆయన మహిళా, పురుషుల వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పర్యటనలో భాగంగా హాస్టల్ గదులు, వంటశాలను, డైనింగ్ హాల్‌ను, తాగునీటి సౌకర్యాలను, మరుగుదొడ్లను పరిశీలించిన వీసీ, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా వేడివేడిగా ఆహారం అందుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పూర్తి భరోసా కల్పించిన వీసీ, 'మీ క్షేమమే మాకు ముఖ్యమైనది. ఏ చిన్న సమస్య వచ్చినా నేరుగా నాకే ఫోన్ చేయండి' అంటూ తన వ్యక్తిగత మొబైల్ నంబర్‌ను అందజేశారు. విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడబోమని ఆయన స్పష్టం చేశారు. తుఫాను సమయంలో స్వయంగా అధికారులే వచ్చి స్థితిగతులను తెలుసుకోవడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కురుస్తున్న వర్షానికి రోడ్లపై వర్షపు నీరు



## ఇబ్బందులు పడుతున్న పాఠశాల విద్యార్థులు

**కోవూరు, మేజర్‌న్యూస్ :** పట్టణ పరిధిలోని కోనమ్మతోట న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రాంతం వద్ద గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై వర్షపు నీరు నిలబడి విద్యార్థులు వాహనదారులు ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఆ నీటిలోనే విద్యార్థులు స్కూలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా విద్యార్థులు స్కూలు కరస్పాండెంట్ నందకిషోర్ మాట్లాడుతూ.. రోడ్లపై ఉన్న నీరుని త్వరితగతిన రోడ్ల పైన నిర్ణయి శుభ్రం చేయించి విద్యార్థులకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందువల్ల ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు రోడ్లపై నిలబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులు గమనించి డ్రైనేజీ ఏర్పాటు చేసి నీరు నిలబడకుండా చేయాలని మహిళలు కోరుతున్నారు.

# వికలాంగుల హక్కులకు రక్షణ కల్పించండి : న్యాయమూర్తి వాణి




**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** వికలాంగుల హక్కులకు భద్రత కల్పించడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారిని సమాజంలో గౌరవంగా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి పేర్కొన్నారు. హైకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి వాణి స్థానిక వెంగళరావు నగర్‌లోని వియాని హోమ్ వికలాంగుల బాలికల వసతి గృహంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా డిసెంబర్ మూడో తేదీన జరుపుకునే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడు తూ.. ప్రపంచ జనాభాలో దాదాపు 16శాతం మంది వికలాంగులు ఉన్నారని వీరిలో చాలా మంది అంగవైకల్యాలు దృష్టిలోపాలు వినికిడి లోపాలు, మేధో వైకల్యాలు వంటి వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్నారని వికలాంగు లందరిని గౌరవిద్దామని సమాజంలో సమాన భాగస్వాములుగా చూద్దామని వారికి అవసరమైన సహాయం, ప్రోత్సాహాన్ని అందిద్దామనిని తెలిపారు. తదుపరి పిల్లలందరికీ బిస్కెట్స్ పండ్లు పంచారు. ఈ కార్యక్రమంలో హోమ్ సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు. వికలాంగుల దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తి స్వయంగా హోంకు వచ్చి తమను ఆదరించడం ఎంతో సంతోషంగా ఉందని బాలికలు సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఘరానా దొంగను అరెస్ట్ చేసిన చిన్న బజారు పోలీసులు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని చిన్న బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో హోటల్ ముందు పార్కు చేసిన ఆటోని దొంగలించిన ఘరానా దొంగని బుధవారం అరెస్ట్ చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు వివరాలు వెల్లడిస్తూ.. గత నెల 22వ తేదీ నెల్లూరు వెంకటరమణ హోటల్ దగ్గర టిఫిన్ తీందామని ఫిర్యాది మీర్జా జుల్ఫ్కర్ ఆలీ ఏపీ 39 డబ్ల్యూఎఫ్ 0914 నెంబర్ గల ఆటోని హోటల్ ముందు పార్క్ చేసి వెళ్లిన క్రమంలో టిఫిన్ పూర్తి చేసుకొని తిరిగి వచ్చి చూడగా తన ఆటో కనిపించలేదని, అంతట చుట్టుపక్కల వెతికి చూడగా ఎక్కడ కనిపించకపోయేసరికి, తన ఆటో ఎవరో గుర్తు తెలియని దొంగలు తన ఆటోను దొంగలించి తీసుకువెళ్లారని నిర్ధారించుకొని ఒకటో నగర చిన్న బజార్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ ఇచ్చారని ఆయన తెలియజేశారు. రిపోర్ట్ అందుకున్న వెంటనే సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. అబ్దుల్ రజాక్ కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాలతో నెల్లూరు టౌన్ డీఎస్పీ సూచనల మేరకు తమ సిబ్బందితో కలిసి వెంటనే ముద్దాయి పనికి కళ్యాణ్ కుమార్ (35) ఎలమవారి దీన్నే నెల్లూరు రూరల్ గురించి సమాచారం సేకరించిగా బుధవారం ముద్దాయి తూను దొంగలించిన ఆటోతో పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అతనిని అదుపులోకి తీసుకొని మధ్యవర్తుల సమక్షంలో విచారించగా ముద్దాయి ఆటోనే కాక వివిధ స్టేషనల పరిధిలో నుండి వివిధ ప్రదేశాలలో దొంగలించి దాచి ఉంచిన 11 మోటర్ సైకిల్ విలువ సుమారు రూ.520000 ముద్దాయి వద్ద నుంచి స్వాధీనం చేసుకొని ముద్దాయిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కి తరలించినట్లు చిన్న బజార్ ఇన్‌స్పెక్టర్ వివరించారు. పై కేసులో ముద్దాయిని అరెస్టు చేసి ప్రతిభ కనబరిచిన చిన్న బజార్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, సబ్ ఇన్స్పెక్టర్ ఎస్కే అబ్దుల్ రజాక్, వారి క్రైమ్ పార్టీ సిబ్బంది సురేష్ బాబు, శ్యాం ప్రసాద్, సుబ్బారావు, వర్ధన్ తదితర సిబ్బందిని ఈ సందర్భంగా పోలీస్ ఉన్నత అధికారులు అభినందించారు.

# రైతు శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో రైతులు పండించే ప్రతి గింజ ప్రతి పంట రైతుకు గిట్టుబాటు కావాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సొసైటీ చైర్మన్ వెంకటేశ్వర్లు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మండలంలోని గుండె మడగల గ్రామంలో రైతన్న మీకోసం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతును రారాజు చేసేందుకు అనేక సంస్కరణలను చేపట్టారన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏవో మాట్లాడుతూ.. నీటి భద్రత డిమాండ్ ఆధారిత పంటలు అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్ గిట్టుబాటు ధర పాడి రైతుకు అండ తదితర కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం వ్యవసాయ ఉద్యాన పశుసంవర్ధక మత్స్యకార రంగాలలో 35శాతం ప్రభుత్వం వాటా అందిస్తుందని, ఈ రంగాలను పరి పుష్పంచేయడం కోసం స్వర్ణాంధ్ర 2047కి అనుగుణంగా సమాజంలో సమాజంలో నేడు మారుతున్న ఆహారపు అలవాటులకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలని పంట మార్పిడి పాటించాలన్నారు. చిరుధాన్యాలైన రాగులు సజ్జలు కొర్రలు వాటికి ప్రస్తుతం డిమాండ్ ఉందని అలాంటి పంటలపై రైతుల దృష్టి సారించాలన్నారు. ప్రకృతిలో వచ్చే వాతావరణ మార్పులను తట్టుకునే పరిష్కార మార్గంగా ప్రకృతి వ్యవసాయం పెద్ద ఎత్తున రైతులు చేపట్టాలన్నారు రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఏపీ ఫార్మర్ రిజిస్టర్ పథకంలో యూనిక్ ఐడీల నమోదుతో ప్రభుత్వ పథకాలు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడం జరుగుతుందన్నారు. డ్రిప్పు స్ప్రింకర్ల సేద్యాన్ని విస్తరించి నీటి వినియోగ సామర్థ్యాన్ని 50శాతం వరకు పెంచి రైతు ఉత్పాదకతను పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యంపై వంద శాతం రాయితీని అందించడం జరుగుతుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం కింద ఒక్కొక్కరికి 14వేలవంతున సుమారు 46,86,838 రైతు కుటుంబాలకు అందించిందన్నారు. ఉపశమనం పంట బీమాను అందించి రైతు పక్షపాతి ప్రభుత్వంగా పాలన కొనసాగిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు, నాయకులు కర్ణం శ్రీనివాసన్ నాయుడు, సిహెచ్ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు ఉన్నారు.

# అన్నదాతలకు భరోసా లక్ష్యంగా రైతన్నా మీకోసం

- డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు ప్రారంభం
- ఈనెల 5న జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో మెగా పేటీఎం
- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమ్మిళతం చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈనెలలో పెద్దఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలు చేపడుతున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తన క్యాంపు క్యాంపు కార్యాలయంలో పలు ప్రభుత్వ కార్యక్రమాలపై ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక కార్యక్రమాలను అమలుచేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 3వ తేదీ నుంచి రైతన్నా..మీకోసం, ఈనెల 4న అన్ని నియోజకవర్గాల్లో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ప్రారంభోత్సవం, ఈనెల 5న మెగా పేటిఎం కార్యక్రమాలను పండుగవాతావరణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### రైతులకు తోడుగా రైతన్నా.. మీ కోసం

రైతులకు ఇటీవల అన్నదాత సుఖీభవ.. పిఎం కిసాన్ నిధులను జమచేసిన సీఎం చంద్రబాబు, రైతాంగానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ తోడుగా వుంటుందని భరోసా కల్పించేందుకు రైతన్నా.. మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఈనెల 3న రాష్ట్రవ్యాప్తంగా రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించినట్లు చెప్పారు. మన జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున త్వరలోనే అన్ని గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో పెద్దఎత్తున రైతన్నా మీకోసం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందిస్తూ, వారికి అన్నివిధాల ప్రభుత్వం అండగా వుందని చెప్పడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా మంత్రి చెప్పారు.

### డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ప్రారంభోత్సవం

గ్రామీణ పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేసి ప్రజలకు పాలనను మరింత సులభతరం చేయడం, పంచాయతీరాజ్ వ్యవస్థను పర్యవేక్షించే పటిష్టమైన పరిపాలన విధానాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డివిజన్ కేంద్రాల్లో డివిజనల్ అభివృద్ధి కార్యాలయాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 4న చిత్తూరుజిల్లాలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ డీడీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తుండగా, వర్చువల్‌గా జరిగే కార్యక్రమాల్లో స్థానికంగా మంత్రులు, ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు. ఆత్మకూరులో డీడీఓ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాను పాల్గొంటునట్లు వెల్లడించారు. నెల్లూరులో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యాలయాల ద్వారా గ్రామీణ వ్యవస్థ బలోపేతంతో పాటు గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం కానుందని ఆయన చెప్పారు.

### ఈనెల 5న మెగా పేటీఎం

5న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో మెగా పేటిఎం (పేరెంట్ టీచర్స్ మీటింగ్) నిర్వహణకు రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాలు జారీచేశారని, ఆ మేరకు జిల్లావ్యాప్తంగా మెగా పేటిఎం కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గం చేజర్లలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగే కార్యక్రమంలో తాను పాల్గొంటానని, ఆయా నియోజవర్గాల్లో ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని మంత్రి చెప్పారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయుల మధ్య ఒక ఆహ్లాదకరమైన వాతావరణం కోసం, విద్యార్థుల ప్రతిభాపాఠవాలు మెరుగుపరిచేందుకు, పాఠశాలల అభివృద్ధి కోసం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

### పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

తెలుగుదేశం పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు శిక్షణ, గ్రామాల్లో బూత్‌స్థాయిలో పార్టీ స్థితిగతుల గురించి విశ్లేషణ, భవిష్యత్‌లో పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి ఆనం చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గానికి 8మంది పరిశీలకులను పార్టీ నియమించినట్లు మంత్రి చెప్పారు. బూత్‌స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేసేందుకు, అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పారు. ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టినట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ.. 2029 ఎన్నికలే లక్ష్యంగా పార్టీని బూత్‌స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా ఇప్పటి నుంచే దృష్టిపెట్టినట్లు చెప్పారు. క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అని, కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, భవిష్యత్‌తో చేపట్టాల్సిన కార్యక్రమాలకు కూడా కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బూత్‌స్థాయిలో లోటుపాట్లను సరిదిద్దుకుని అందరిని సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

### సీఎం దృష్టికి జిల్లా పునర్విభజన సమస్యలు

జిల్లాల పునర్విభజనపై అభ్యంతరాలు తెలిపేందుకు 30 రోజుల గడువును ప్రభుత్వం ప్రకటించిందని, ఈలోగా ప్రజలు, ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అభ్యంతరాలను, సలహాలను మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్తామని, అన్ని విషయాలను కూలంకషంగా చర్చించిన తదుపరి సీఎం చంద్రబాబునాయుడు తుది నిర్ణయం ప్రకటిస్తారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, తాళ్లూరు గిరినాయుడు, కేశవ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల వాహనాలను తరచూ పరిశీలించుకోవాలి : ఎంవీఐ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో స్కూల్‌వాహనాలను బుధవారం స్థానిక మోటర్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాములు తనిఖీ చేశారు. అన్ని వాహనాల పరిస్థితి, రికార్డులు, డ్రైవర్లను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఎంవిఐ రాములు మాట్లాడుతూ.. స్కూల్స్ యజమానులు తమ సంస్థల వాహనాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటుండాలన్నారు. స్థానిక ఏఎస్ఆర్ డిగ్రీకాలేజీలో వాహనాలను ఆయన తనిఖీ చేశారు. స్కూల్ వాహనాలను నడుపుతున్న డ్రైవర్ల లైసెన్సులు, వారి అనుభవాలను ఆయన పరిశీలించారు. యజమానులకు, డ్రైవర్లకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రతి వాహనానికి ఎమర్జన్సీడోర్‌లుండాలన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తుకోసం ఎన్నో ఆశలుపెట్టుకొని విద్యాభ్యాసంకోసం పాఠశాలలకు పంపుతుంటారని, వారిని సురక్షితంగా పాఠశాలలకు తీసుకొచ్చి సాయంత్రం వారి ఇళ్ళకు చేర్చాలని ఆయన సూచించారు. తమ పరిధిలో పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన వాహనాలను తనిఖీలు చేసి వారికి తగు సూచనలు చేస్తున్నామన్నారు. త్వరలో వారం రోజులపాటు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తామని, విజయవాడనుండి ప్రత్యేక బృందాలు వచ్చి




ఆకస్మికంగా అన్ని పాఠశాలల వాహనాలను తనిఖీలు చేస్తారని ఆయన తెలిపారు. విద్యార్థులు వాహనాల్లో ప్రయాణించే సమయంలో వారిని గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని రాములు సూచించారు. వాహనాలు ఏదేని ఇబ్బందులకు గురైతే వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులకు, స్కూల్ యాజమాన్యాలకు, పోలీసులకు డ్రైవర్లు సమాచారమివ్వాలని ఆయన సూచించారు.

# ఏపీఎన్‌జీఓ ఎన్నికలు నేడే

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఏపీఎన్‌జీఓ కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం నామినేషన్లు స్వీకరించామని, గురువారం ఉదయం 8గంటలనుండి సాయంత్రం 5గంటలవరకు ఎన్నికలు జరుగుతాయని ఆత్మకూరు తాలూకా ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్‌సెక్రటరి ఏవి కృష్ణ పేర్కొన్నారు. నవంబర్ 25న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశామని ఆయన పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఇందుకుగాను సహాయ ఎన్నికల అధికారిగా నెల్లూరు సిటీ అధ్యక్షుడు సిహెచ్ రామకృష్ణారెడ్డిని, ఎన్నికల పర్యవేక్షణకు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఐ.పెంచలయ్యలను జిల్లా అధ్యక్షుడు నియమించారని కృష్ణ పేర్కొన్నారు. తాలూకా పరిధిలోని ఎన్‌జీవోలందరూ గురువారం నాటి ఎన్నికల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

# ఆత్మకూరులో ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని వెస్ జెడ్పి హైస్కూల్ ఆవరణలో బుధ వారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు మండల విద్యాశాఖాధికారిణి సి.హెచ్.అనంతలక్ష్మి చేతుల మీదుగా బహుమతులందజేశారు. అతిథిగా హాజరైన అనంతలక్ష్మి మాట్లా డుతూ రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతికపరంగా దివ్యాంగుల ఎదుగుదలను అందరూ ప్రోత్సహించాలని, ఇలాంటి పిల్లలున్న తల్లిదండ్రులు నిరాశానిస్పృహలకు గురాకారాదని, ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషిచేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెస్‌హైస్కూల్ ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు ఎం.గంగాధరం, ఐఆర్‌పి ఏ.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రైతన్నను అన్నివిధాల ఆదుకోవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రైతన్న-మీకోసం కార్యక్రమం రాపూరు మండలంలోని ఏపూరు గ్రామంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాపూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రైతుల ఉద్దేశించి మాట్లాడారు. రైతును

# ఏపూరులో రైతన్న-మీకోసం

రాజు చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నాయని అశోక్‌రెడ్డి చెప్పారు. రైతులు పెట్టుబడి వ్యయం తగ్గించి ప్రకృతి ద్వారా లభించే సేంద్రీయ ఎరువులను వినియోగించాలని చెన్ను అశోక్‌రెడ్డి సూచించారు. ఏపూరు గ్రామ సర్పంచ్ రాధా కృష్ణ అధ్యక్షతన మాలేపాటి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాపూరు పీఏసీఎస్ అధ్యక్షులు దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, క్లస్టర్-3 కన్వీనర్ నల్లపద్ద వెంకటరమణారెడ్డి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, క్లస్టర్-3 కో-కన్వీనర్ చెన్ను పెంచలరెడ్డి, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చిగళ్ళ రత్నయ్య, యూనిట్-9 కన్వీనర్ కూకటి పెంచలయ్య, ఏపూరు గ్రామరైతులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర వ్యవసాయ ప్రణాళికపై వర్క్‌షాప్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రైతన్నామీకోసం, సమగ్ర వ్యవసాయ ప్రణాళికలపై ఆత్మకూరులో బుధవారం వ్యవసాయ, అనుబంధశాఖల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వర్క్‌షాప్ నిర్వహించారు. నెల్లూరుపాళెం రైతుసేవా కేంద్ర పరిధిలోని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఏ.శారద మాట్లాడుతూ.. ఈ సీజన్, రాబోవు సీజన్‌లలో రైతుల ఆర్థికాభివృద్ధిని పెంచే దిశగా రైతుసేవాకేంద్రం పరిధిలో సుస్థిర, సమగ్ర ప్రణాళికలు తయారుచేయడం జరుగుతుందని, రైతుల భాగస్వామ్యంతో అన్ని అనుబంధ శాఖల అధికారులు ఈ కార్యక్రమం ద్వారా రైతుల నికరాదాయం పెరిగేందుకు కృషి చేస్తారని ఆమె తెలిపారు. ఆత్మ డీపీఓ ఐ.మురళీ మాట్లాడుతూ.. రైతులు కేవలం వరిపంటలే కాకుండా డిమాండ్ ఉన్న ఆధారిత పంటలవైపు మొగ్గు చూపాలని కోరారు. కృషి విజ్ఞానకేంద్రం



శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి వరి, ఇతర పంటలలో ఖర్చులు తగ్గించుకునే శాస్త్ర పరిజ్ఞానం గురించి అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఉద్యానాధికారి కె.రాజశేఖర్, ఎనిమల్‌హజ్‌బెండరీ ఏడి వెంకటేశ్వర్లురెడ్డి ఉద్యాన పంటలు, పశువుల పెంపకం, రైతులు నికరాదాయం పెంచుకునే పద్ధతులు గురించి వివరించి రైతులతో చర్చించారు. ఈకార్యక్రమం ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించగా పలువురు రైతులు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాక్సినేషన్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్ పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వైద్య ఆరోగ్య సిబ్బంది వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో ప్రతి బుధవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీకాగా ఈదపా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు వివిధ రకాల వ్యాక్సిన్‌లను వేశారు. 20మంది గర్భిణీలకు సిబ్బంది వ్యాక్సిన్‌లను వేశారు. క్రమం తప్పకుండా నిర్ణీతసమయంలో వ్యాక్సిన్‌లు వేయించుకోవాలని హాస్పిటల్ ప్రతినిధి సిద్దం సుధాకర్ కోరారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త షకీలా తదితరులు పాల్గొన్నారు.

# క్షేమంగా ఉన్న త్వరలో మీ మధ్యకు వస్తా



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డికి ఇటీవల అస్వస్థకు గురై బైపాస్ సర్జరీ నిర్వహించారు. వైద్యశాలలో ఉండగా నియోజకవర్గ ప్రజలు తమ అభిమానులు పూజలు, ప్రార్థనలు నిర్వహించడం తెలిసిందే. అయితే బుధవారం ప్రతాప్ కుమార్ రెడ్డి వైసీపీ నాయకులకు కార్యకర్తలకు ఒక ప్రకటనలో ప్రజలకు తెలిపుతూ, నేను క్షేమంగా ఉన్నాను త్వరలోనే మీ మధ్యకు వస్తాను అని నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు తెలిపారు. కావలి పట్టణంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ మాటతో సంతోషం వ్యక్తపరిచారు.

## గృహ నిర్మాణాల దరఖాస్తు గడువు 14కు పెంపు

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం ద్వారా పేద వర్గాలకుగృహ వసతి కల్పించే క్రమంలో ఇంటి నివేశనస్థలాల కేటాయింపు అదేవిధంగా స్థలాలు ఉన్నవారికి గృహ నిర్మాణం కొరకు నిర్ణయించిన దరఖాస్తు గడువు ఈనెల 14 వరకు పొడిగించినట్లు కోడూరు పంచాయతీ టీడీపీ నేతసామాజిక కార్యకర్త మానవత్వ చైతన్య సమితి నిర్వాహకులు కొమారి శ్రీనివాసులు పేర్కొన్నారు. పంచాయతీలోని పేద వర్గాలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ దరఖాస్తులను కోడూరు సచివాలయంలో సమర్పించాల్సిందిగా కోరారు.

# శరత్ చంద్ర రెడ్డి కుటుంబానికి పరామర్శ



**కావలి, మేజర్‌న్యూస్ :** బుర్ర శరత్ చంద్రరెడ్డి అక్క బుర్ర అపర్ణ మరణించడం జరిగినది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డివారి సతీమణి శివప్రియ బుధవారం వారి గృహానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడుతూ.. బుర్ర సుపర్ణ మరణించడం చాలా బాధాకరమని ఆ లోటును దేవుడే పూడ్చాలని భగవంతున్ని ప్రార్థించారు. వీరితోపాటు గోసల గోపాల్‌రెడ్డి హాజరయ్యారు.

## నేడు ఆత్మకూరులో మంత్రి ఆనం పర్యటన

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో గురువారం దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటిస్తారని ఆయన కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఆత్మకూరులో డివిజనల్ డెవలప్ మెంట్ ఆఫీసర్ కార్యాలయాన్ని మంత్రి రామనారాయణరెడ్డి ప్రారంభి స్తారని వారు తెలిపారు. ఈనెల 5వ తేదీ చేజర్లలో మంత్రి పర్యటిస్తారని, స్కూల్లో మెగా పేరెంట్స్ టీచర్స్‌మీటింగ్‌లో మంత్రి పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ శేఖర్‌బాబుకు సత్కారం




**కావలి, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో 30 సంవత్సరాలకు పైగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ, ఈనాడు, ఆంధ్రప్రభ, పత్రికలతోపాటు మరికొన్ని దినపత్రికలలో జర్నలిస్టుగా పనిచేసే ఎన్నో ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేసిన వార్తలుదినపత్రిక, మాస పత్రిక సంపాదకులు, వీఎన్ఎన్ న్యూస్ యూట్యూబ్ ఛానల్ అధినేత సీనియర్ జర్నలిస్టు గాదంశెట్టి శేఖర్ బాబుకి నెల్లూరు ప్రియదర్శిని లైన్స్ క్లబ్ వారి చేతుల మీదుగా బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దేసు కల్పన, కోశాధికారి దరిశి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# కామాక్షితాయి దేవస్థానం నందు హుండీలు లెక్కింపు

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీ జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానం నందు బుధవారం హుండీలు లెక్కింపు కార్యక్రమం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, చైర్మన్, పాలక మండలి సభ్యులు, దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి సమక్షంలో హుండీలు తెరిచి భక్తులు శ్రీవార్లకు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఆగస్టు 30 నుండి డిసెంబర్ 2వ తేదీ 95 రోజులకు గాను శ్రీ వార్ల ప్రధాన ఆలయ హుండీలు ద్వారా ఆదాయం రూ.48,89,218/- యూఎస్ డాలర్స్ 123, కెనడియన్ డాలర్ 15, బంగారు వస్తువులు 71 గ్రాములు 500 మిల్లీ గ్రాములు, వెండి వస్తువులు 170గ్రాములు, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.3,14,050 భక్తులు శ్రీవార్ల హుండీ ద్వారా సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, పాలక మండలి సభ్యులు ముంగర సుధాకర్, రామాయణం సుధా రాణి, పర్యవేక్షణాధికారిగా ఎన్.శ్రీధర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ



రామలింగేశ్వరస్వామి దేవస్థానం, పూడిపర్తి, స్థానిక ఏపీజీ బ్యాంక్ అధికారులు, ఆలయ సిబ్బంది, ఎస్.సుబ్బారాయుడు అధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగులు, ఓ.వెంకయ్య, ఏఎస్ఐ బుచ్చిరెడ్డిపాలెం, జొన్నవాడ గ్రామ రెవెన్యూ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# విస్తృతంగా పర్యటిస్తున్న కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం పడుతుండడంతో టిడిపి నాయకులు

**పలు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీరు బయటకు పంపేందుకు చర్యలు**

కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి స్థానిక మాగుంట లేఔట్, గోమతి నగర్, మినీ బైపాస్ తదితర ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి విస్తృతంగా పర్యటించారు. వర్షపు నీరు కొన్ని ప్రాంతాల్లో నిలిచిపోవడంతో పంట కాలవల ద్వారా వర్షపు నీటిని పంపేందుకు కార్పొరేషన్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సందర్భంగా ఆయన సూచించారు. పర్యటన సందర్భంగా అక్కడ స్థానికులతో ఆయన మాట్లాడారు. ఏ అవసరం వచ్చిన వెంటనే ఎమ్మెల్యే కార్యాలయానికి ఫోన్ చేయాలని సూచించారు. కార్పొరేషన్ ఈఈ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి మండల పూజల మహాదీపారాధన

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వేదాయపాలెంలో వేంచేసి ఉన్న వేదశాస్త్ర శ్రీ స్వామి అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామికి కేరళ సాంప్రదాయ పద్ధతి లో మండల పూజలు బుధవారం జరిగాయి. తొలుత అయ్యప్ప స్వామి నిర్మాల్య దర్శనం, పాలాభిషేకం, మహాగణపతి హెూమం, స్వామి వారికి ఉషః పూజ, శ్రీ వేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, ఉచ్చ పూజ, శ్రీ వేలి ఉత్సవం, సాయంత్రం పూలంగి సేవ దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, అత్తలపూజ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర దీపం, హరిహరాసనం అయ్యప్ప స్వామివారి సేవలు కేరళ సాంప్రదాయంలో జరిగాయి. బుధవారం మండల పూజకు, అయ్యప్పలకు భక్తులకు అన్నదానం రాత్రి బిక్ష కార్యక్రమాలకు ఇంటూరు దీనానాద్ సాయినర్మదా దంపతులు, ఓంకార్ శ్రీకృష్ణ గురు ప్రసాద్‌లు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అధ్యక్షులు గూడల శేషగిరిరావు కార్యదర్శి కత్తుల వెంకట



రత్నం కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షణలో జరిగాయి. కమిటీ సభ్యులు కత్తి మోహన్‌రావు, కేజీ శంకరన్, బొగ్గుల మురళీమోహన్‌రెడ్డి, పావలా ప్రసాద్, విజయ్ కుమార్ పలువురు అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## కార్గో హ్యాండ్లింగ్‌లో ఏకేపీఎల్ రికార్డు : సీఈఓ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అదాని కృష్ణపట్నం ఓడరేవు భూభాగంలో యాంత్రిక బెర్త్ లో ఒక రోజులోనే 132800 మెట్రిక్ టన్నుల అత్యధిక పరిమాణాన్ని నిర్వహించడం జరిగింది. ఈ విషయాన్ని యాజమాన్యం తెలిపింది. గతంలో గరిష్టంగా 2025 ఏప్రిల్ 20న 1,31,966 మెట్రిక్ టన్నులు నిర్వహించడమైనది. అంతకంటే ఎక్కువ కార్గో హ్యాండిల్ చేయడంతో పోర్ట్ సరికొత్త రికార్డు నెలకొల్పినట్లు పోర్ట్ అధికారులు తెలిపారు. ఎకెపిఎల్ సీఈఓ జగదీష్ పటేల్ ఈ యొక్క బృందాన్ని అభినందించారు. అనంతరం మాట్లాడారు. పారిశ్రామిక రంగంలో ఇంతటి మైలురాయిని సాధించడంలో యాంత్రిక సహాయపడినట్లు సీఈఓ అన్నారు. అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ నవంబర్ 2025లో అత్యధిక నెలవారీ ఎరువుల సరుకును 0.43 ఎంఎంటీలను విజయవంతంగా నిర్వహించామన్నారు. 2023 సంవత్సరం డిసెంబర్ నెల నందు 0.36 ఎంఎంటీల ఏ అధిక మించినట్లు ఆయన పేర్కొన్నారు.

## వరద నీటీ ప్రవాహాన్ని పర్యవేక్షించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ నగరవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీటి ప్రవాహాన్ని పర్యవేక్షించేందుకు బుధవారం ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగం అధికారులతో కలిసి వివిధ ప్రాంతాలలో పర్యటించారు. ముందుగా స్థానిక అయ్యప్పగుడి సమీపంలో గుర్రం బాబయ్య కళ్యాణ మండపం ప్రాంతంలో రోడ్లపై నిలిచిన వరద నీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించేందుకు ఆదేశించి పనులను పర్యవేక్షించారు. అనంతరం స్థానిక 30వ డివిజన్ రామకోటయ్య నగర్ ప్రాంతంలో వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న డ్రైన్ కాలువల బ్లాకేజీలను సిబ్బంది సహాయంతో తొలగించే పనులను కమిషనర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జలమయంగా మారిన లోతట్టు ప్రాంతాలు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** దిత్వా తుఫాను ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో నెల్లూరులోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీరు కొన్ని ప్రాంతాల్లో నిలిచిపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మాగుంట లేఔట్, వైయస్సార్ నగర్, మనుమా సిద్ది నగర్, గోమతి నగర్ మినీ బైపాస్ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు.బుధవారం వర్షపు నీరు వల్ల కొన్నిచోట్ల వాహనదారులు అవస్థలు పడ్డారు. భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. అయ్యప్ప గుడి హైవే నుంచి బుజబుజ నెల్లూరు, ప్రాంతంలో వరద నీరు వల్ల ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తుఫాను వల్ల పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి ప్రజల అవస్థలు పడ్డారు.



## రగ్బీ అండర్-19లో సీవీకేజీజేసీ విద్యార్థులు ఎంపిక



**రాపూరు, మేజర్‌న్యూస్ :** 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్-2025 ఆధ్వర్యంలో కర్నూల్‌లో జరిగిన అండర్-19 రగ్బీ పోటీలలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం, జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఆడేందుకు స్థానం సాధించారని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి బుధవారం తెలిపారు. తమ కళాశాలకు చెందిన క్రీడాకారులు టీ.శశిరాజు, ఏ.వాణి జాతీయ స్థాయిలో ఆడేందుకు ఎంపిక కావడం హర్షణీయమని ఆమె పేర్కొన్నారు. రగ్బీ పోటీలలో రాష్ట్రస్థాయి తృతీయ స్థానం సాధించిన క్రీడాకారులను సీవీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీ.క్రిష్ణవేణీ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సహచర విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో మరింత మెరుగ్గా రాణించేందుకు దాతలు ముందుకొచ్చి సహకారం అందించి ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్ కృష్ణవేణి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జూనియర్ కళాశాలలో క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఆలయాలు, భజన మండపాలు నిర్మాణం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండల ప్రజలకు శుభవార్త టీటీడీ సహకారంతో శ్రీవాణి ట్రస్ట్ నిధులతో గ్రామాల్లోని ఆలయాలు, భజన మండపాలు నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది. ఈ ట్రస్ట్ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీ వాసులకులకు ప్రాధాన్యత నిస్తుంది. కావున మన మండలంలోని గ్రామాల్లో ఆలయాలు భజన మండపాలు నిర్మాణాలు అవసరమైన వారు ఆయా గ్రామాల్లోని మన కూటమి నాయకులను సంప్రదించి వివరాలను సేకరించాలని కన్వీనర్ చింతనబోయిన బయ్యాన్న పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో ఆయా గ్రామాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. కావున మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనిఆయన తెలిపారు.